TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 27 20-6-2025 శుక్రవారం పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, M Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri

# బనకచర్లను అడ్డుకోండి



న్యూఢిల్లీ,(సందేశం టైమ్స్, జూన్ 19):తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్టును తిరస్కరించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.


మిగతా 2లో...

- తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఆ ప్రాజెక్టు ప్రతిపాదన
- జీడబ్ల్యూడీటీ, పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ఏపీ సర్కారు
- అపెక్స్ కౌన్సిల్ అనుమతీ పొందలేదు.. ఇది తీవ్ర అభ్యంతరకరం
- బనకచర్ల బదులు ఇచ్చంపల్లి-సాగర్ అనుసంధానంపై చర్చకు సిద్ధం
- గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీలకు మాకు ఎన్వోసీ కావాలి
- పాలమూరు, సమ్మక్క, తుమ్మిడిహెట్టిలకు అన్ని అనుమతులూ ఇవ్వండి
- ఏపీ ప్రాజెక్టులకు సత్వరమే అనుమతులిస్తూ మాపై అలసత్వం సరికాదు
- కేంద్రం వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడం.. అవసరమైతే సుప్రీం కోర్టుకు
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ
- అతి త్వరలో అపెక్స్ కౌన్సిల్ భేటీ.. పాటిల్ హామీ ఇచ్చారన్న ఉత్తమ్

## ఆక్స్‌ఫర్డ్ ఫోరమ్‌లో ప్రసంగించనున్న కేటీఆర్ !



(సందేశం టైమ్స్, జూన్ 19): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల జూన్ 20-21 తేదీల్లో యునైటెడ్ కింగ్‌డమ్ లోని ప్రతిష్ఠాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లో నిర్వహించనున్న లో పాల్గొననున్నారు.ఈ సందర్భంగా కేటీఆర్, "భారత అభివృద్ధికి ఫ్రంటియర్ టెక్నాలజీల పాత్ర" అనే అంశంపై ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగంలో ఆయన తెలంగాణ అభివృద్ధి మోడల్, సాంకేతిక పరిజ్ఞానంను వినియోగించి సాధించిన సమగ్ర అభివృద్ధి, అంతర్జాతీయ పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించిన విధానం వంటి అంశాలను ప్రస్తావించనున్నారు.తెలంగాణ రాష్ట్రం విశిష్ట అభివృద్ధి విధానంతో ప్రపంచంలో అనేక దేశాల దృష్టిని ఆకర్షించగా, ఇప్పుడు ఆ మోడల్‌ను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించనున్న కేటీఆర్ ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.



గోదావరి-బనకచర్లకు బదులుగా

## కృష్ణాలో 200 టీఎంసీల వాటా ఇవ్వాలి

### తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం

(సందేశం టైమ్స్, జూన్ 19): పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి జలాలను గోదావరి-బనకచర్ల అనుసంధానంతో తరలిస్తే... దానికి బదులుగా కృష్ణాలో 200 టీఎంసీల వాటాను అదనంగా తెలంగాణకు కేటాయించాలని తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం డిమాండ్ చేసింది. అంతేకాకుండా గోదావరి, దాని ఉప నదులపై పూర్తయిన, కొనసాగుతున్న, భవిష్యత్తులో చేపట్టనున్న అన్ని ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించాలని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంప్రసాద్ రెడ్డి, తన్నీరు వెంకటేశం డిమాండ్ చేశారు. అన్ని అనుమతులు తీసుకున్నాకే గోదావరి-బనకచర్ల అనుసంధానం చేపట్టాలని కోరారు.

మిగతా 2లో...

## వ్యవసాయ యాంత్రీకరణకు 104 కోట్లు!

2లో



## మనం మనం కొట్టుకుంటే లాభమేంటి

అమరావతి, (సందేశం టైమ్స్, జూన్ 19): బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "గోదావరిలో నీళ్లు ఉన్నాయి. వాటిని తెలంగాణ, ఏపీ రెండూ ఉపయోగించుకుంటున్నాయి. తెలంగాణ వాళ్లను పైన ఎన్ని ప్రాజెక్టులైనా కట్టుకోమనండి. మనం వారు దిగువకు వదిలేసిన నీటినే ఉపయోగించుకుంటున్నాం. దీనివల్ల ఎవరికీ నష్టం లేదు. దీనిపై మనం మనం కొట్టుకుంటే లాభం లేదు."

## తెలంగాణ కానీ, ఆంధ్రా కానీ అంతా తెలుగువారే

- గొడవ పడటమంటే ప్రజల్ని మోసం చేయడమే
- సముద్రంలో కలిసే నీటివాడకంపై వివాదమేంటి?
- కాళేశ్వరం కట్టుకున్నప్పుడు నేను అడ్డుచెప్పలేదు
- ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో పరిష్కరించుకుందాం
- చట్టబద్ధత కావాలంటే కేంద్రం వద్ద కూర్చుందామని చెబుతున్నా
- బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు

అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి ఎవరికి కేటాయించిన నీటిని వారు వాడుకుందామని, కొత్త ట్రైబ్యునల్ వచ్చిన తర్వాత దాని ప్రకారం నడుచుకుందామని తెలంగాణ ప్రభుత్వానికి సీఎం సూచించారు. ''తెలంగాణలో కాళేశ్వరం కట్టుకున్నప్పుడు నేను అడ్డుచెప్పలేదు. పైనుండేవారు నీటిని వాడుకుంటే నష్టమా లేక కింద ఉండేవారు నీటిని వాడుకుంటే నష్టమా? మీరు నీరు వాడుకోకపోతేనే కదా ఆ నీరు కిందకు వచ్చి సముద్రంలో కలిసేది.

మిగతా 2లో...

## టీటీడీ చైర్మన్‌తో ఎమ్మెల్సీ కవిత భేటీ



హైదరాబాద్,(సందేశం టైమ్స్, జూన్ 19): తిరుపతి హతిరామ్ బావాజీ మఠంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బంజారా పీఠాధిపతులకు పూజలు చేసే అవకాశం కల్పించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని వివిధ బంజారా పీఠాధిపతులతో కలిసి ఆమె గురువారం హైదరాబాద్‌లో టీటీడీ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈనెల 30న హతిరామ్ బావాజీ జయంతి సందర్భంగా బంజారా (సుగాలి, లంబాడీ) పీఠాధిపతులు, పూజారులకు మఠంలో ప్రత్యేకంగా పూజలు చేసే అవకాశం కల్పించడంతోపాటు నైవేద్యం సమర్పించడానికి ఏర్పాట్లు చేయాలని ఆమె కోరారు. దీనిపై త్వరలోనే పీఠం నిర్వాహకులు, గిరిజన పీఠాధిపతులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బీఆర్ నాయుడు హామీ ఇచ్చినట్టు కవిత తెలిపారు.

మిగతా 2లో...

## ఎన్కేపల్లిలో 'మహా' గోశాల!



## బనకచర్లకు రేవంత్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుంది!



2లో

- నదీ జలాలు మీ అయ్య జాగీరా?
- రాష్ట్ర హక్కులు బాబుకు రాసిస్తే.. ప్రజలు ఊరుకోరు
- బాబును అడుక్కునే బుద్ధి పోవట్లేదు
- అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్న సీఎంను ఉరి తీసినా తప్పులేదు
- బీఆర్ఎస్ నేత హరీశ్ విమర్శలు

# తెలంగాణ రైజింగ్ విజన్ అద్భుతం



- రాష్ట్ర సుస్థిరాభివృద్ధి దిశగా రేవంత్ రెడ్డి ప్రణాళిక సీఎంపై బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసలు
- ఫ్యూచర్ సిటీ, స్కిల్స్, స్పోర్ట్స్ వర్సిటీలపై ఆసక్తి
- లెటర్ ఆఫ్ ఇంటెంట్ మార్చుకున్న తెలంగాణ, టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్

న్యూఢిల్లీ, (సందేశం టైమ్స్, జూన్ 19): 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్ అద్భుతంగా ఉందని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. రాష్ట్ర సుస్థిరాభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక ఉందని కొనియాడారు. యూకేకు ఆయన 1997 - 2007 మధ్య పదేళ్లపాటు ప్రధానిగా పనిచేశారు. ఇంగ్లండ్ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారు. రాజకీయాల నుంచి తప్పుకొన్న తర్వాత ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని నాయకులకు విజన్, వ్యూహ రచన.. వాటి అమలుకు సహకరించాలనే ఉద్దేశంతో 'టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టీబీఐజీసీ) స్థాపించారు. ఇందులో భాగంగా, ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న టోనీ బ్లెయిర్‌తో ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. పట్టణ, పట్టణ శివారు, గ్రామీణ ప్రాంతాల వారీగా తాము అమలు చేయబోయే సూక్ష్మ ప్రణాళికను ఆయనకు వివరించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' ముఖ్యాంశాలను తెలిపారు.

# మనం మనం కొట్టుకుంటే లాభమేంటి

తెలంగాణపై నేను గొడవ పడ్డానా?

"తెలంగాణపై ఎప్పుడైనా గొడవ పడ్డానా? మనం గొడవ పడటం అంటే ప్రజలను మభ్యపెట్టడమే! దానివల్ల రెండు రాష్ట్రాల ప్రజలకూ లాభం లేదు. పోరాటాలు అవసరం లేదు. కట్టే ప్రాజెక్టులన్నీ కట్టి నీళ్లు తీసుకోమనే తెలంగాణ వారికి చెబుతున్నాం. మిగిలినదే మేం వాడుకుంటాం. మనం మనం తిట్టుకుంటే దాన్ని రాజకీయం చేయాలని చూసేవారు చాలా మంది ఉన్నారు. గోదావరిలో చాలా నీళ్లు ఉన్నాయి. ఎవరి ఓపికను బట్టి వారు వాడుకోవచ్చు. 3వేల టీఎంసీల నీరు ప్రతియేటా సముద్రంలో కలుస్తోంది. తెలంగాణ ఎంత వాడుకున్నా 100 టీఎంసీలు వాడుకుంటుంది.. మనం ఎంత వాడుకున్నా మరో 100 టీఎంసీలు వాడుకోగలం. దీనిపై రాద్ధాంతం ఎందుకు? ఏపీ, తెలంగాణ నంబర్ వన్‌గా ఉండాలన్నదే నా ఆశయం.. అందరం కలిసి తెలుగుజాతిని ప్రపంచమే హద్దుగా అభివృద్ధి పథంలో నడిపిద్దాం. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ కట్టినా.. ఇక్కడ అమరావతి కడుతున్నా నా కోసం కడుతున్నానా? భవిష్యత్తు తరాల కోసం కడుతున్నాం. తెలంగాణ ఎకో సిస్టమ్ చాలా మంచిది. దాన్ని ఇక్కడ తీసుకురావాలంటే చాలా కష్టపడాలి."

చాలా ప్రాజెక్టులు మొదలుపెట్టింది నేనే..

"గోదావరి నీళ్లను ఇరు రాష్ట్రాలు వాడుతున్నాయి. పోలవరం తప్ప మిగతావి అనుమతి రాని ప్రాజెక్టులే. విభజన చట్టంలో భాగంగా పోలవరం నిర్మాణం జరుగుతోంది. గోదావరి ప్రవాహంలో చిట్టచివరి రాష్ట్రంగా....వచ్చిన నీటిని వచ్చినట్టు మరో బేసిన్‌కు తరలిస్తున్నాం. గతంలో కృష్ణా బ్యారేజ్‌పై ఇరు రాష్ట్రాల సిబ్బంది గొడవ పడ్డారు. గవర్నర్ వద్ద కూర్చొని పరిష్కరించుకున్నాం. కృష్ణాలో తక్కువగా ఉన్న నీటిపై గొడవపడితే లాభం లేదు. ఉమ్మడి ఏపీలో నేనే చాలా ప్రాజెక్టులు మొదలుపెట్టాను. దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టులుమొదలు పెట్టాను. ఎల్లంపల్లి ప్రాజెక్టుపై వివాదం వేస్త అసెంబ్లీలో పోరాడాం."

# బనకచర్లను అడ్డుకోండి

ఈ ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ - 1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014కు విరుద్ధంగా ఏపీ సర్కారు వ్యవహరిస్తోందని తెలిపారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీతోపాటు ఇతర ఉన్నతాధికారులతో రేవంత్, ఉత్తమ్ గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక, పర్యావరణ శాఖలు వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని చెప్పారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోందని, కానీ, జీడబ్ల్యూడీటీ - 1980లో వరద, మిగులు జలాల ప్రస్తావనే లేదని వివరించారు. పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా కొత్తగా ప్రాజెక్టును కట్టాలనుకుంటే తొలుత ఆ నదీ యాజమాన్య బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని, కానీ, ఏపీ వీటన్నింటినీ ఉల్లంఘిస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏ నిబంధనలూ పాటించకుండా.. వరద జలాల ఆధారంగా ప్రాజెక్టు చేపడుతున్నామని చెప్పడం తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనుమతులు లేకుండానే పోలవరం కింద ఎత్తిపోతల పథకాలు సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టిందని కేంద్ర మంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ వివరించారు. పోలవరం డిజైన్లను మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోందని, తాము అభ్యంతరాలు లేవనెత్తినా పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. గోదావరిలో వరద జలాలు ఉన్నాయని ఏపీ నిజంగా భావిస్తే.. పోలవరం - బనకచర్లకు బదులు కేంద్రం నిధులు ఇచ్చే ఇచ్చంపల్లి - నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయమై చర్చకు తాము సిద్ధమని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తాము ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదన్నారు. అన్ని వేదికల ద్వారా సామరస్యపూర్వకంగా సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కేంద్రం స్పందన అనుకూలంగా లేకపోతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. 1,500 టీఎంసీలకు అనుమతులు ఇవ్వండి గోదావరి నదిలో 1000 టీఎంసీలు, కృష్ణా నదిలో 500 టీఎంసీలు.. మొత్తంగా 1,500 టీఎంసీల వినియోగానికి తెలంగాణకు కేంద్ర జల్‌శక్తి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని, దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఫలితంగా, కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని, ఆ తర్వాత ఏపీ చేపట్టే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. "ఏపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియపై సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదు. ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి" అని తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి, సమ్మక్క - సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతోపాటు అన్ని రకాల అనుమతులు వెంటనే మంజూరు చేయాలని, గంగ, యమున నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవనానికి కూడా కేటాయించాలని కోరారు. కేంద్ర మంత్రితో సమావేశం తర్వాత మంత్రి ఉత్తమ్ ఆ వివరాలను మీడియాకు వివరించారు. "సీఆర్ పాటిల్‌తో సుమారు గంటసేపు సమావేశం జరిగింది. అన్ని ప్రాజెక్టుల విషయంలోనూ సానుకూలంగా స్పందించారు. బనకచర్ల డీపీఆర్ తమకు అందలేదని, దీనిపై త్వరలోనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని అన్నారు. అతి త్వరలో ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశం నిర్వహించి అన్ని విషయాలు చర్చిస్తామని హామీ ఇచ్చారు. అపెక్స్ కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టడం కుదరదు. కానీ.. ఏపీ చేపడుతోంది. ఇది రెండు రాష్ట్రాలకు మంచిది కాదు" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. సమావేశంలో ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డితోపాటు రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

# ఎన్కేపల్లిలో 'మహా' గోశాల!

## వంద ఎకరాల్లో ఏర్పాటుకు ప్రణాళిక

## వ్యతిరేకిస్తూ కోర్టుకెళ్లిన కొందరు స్థానికులు

## వివాదాల పరిష్కారానికి అధికారుల చర్యలు

హైదరాబాద్ (సందేశం టైమ్స్, జూన్ 19): హైదరాబాద్ నగర శివారు మెయినాబాద్ మండలం ఎన్కేపల్లిలో వంద ఎకరాల్లో 'మహా' గోశాలను ఏర్పాటు చేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపడుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో భాస్కర్ వైద్య కళాశాల వెనుక వంద ఎకరాల వరకు ఉన్న ఈ ప్రభుత్వ భూముల్లో గోశాల ఏర్పాటు చేయడానికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ భూములను స్వాధీనం చేసుకుని చుట్టూ కంచె ఏర్పాటుకు హెచ్ఎండీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఆ భూములకు హద్దులు నిర్ణయిస్తుండగా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొందరు కోర్టుకు వెళ్లారు. ఈ వివాదాల పరిష్కారంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. ఎన్కేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 180లో 99.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కొన్నేళ్లుగా ఖాళీగా ఉండడంతో సుమారు 40 కుటుంబాలు వ్యవసాయం చేసుకుంటున్నాయి. వారు తాజాగా హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారుల సర్వేను అడ్డుకున్నారు. తమకు హక్కులు ఉన్నాయంటూ 26 మంది వరకు కోర్టుకెక్కారు.

సేత్వారి నుంచి ఇప్పటివరకు పూర్తిగా ప్రభుత్వ భూమి కావడం, ఏనాడూ ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అసైన్ చేయకపోవడంతో కోర్టు సైతం రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారుల సర్వేపై ఎలాంటి స్టే విధించలేదని తెలిసింది. తగిన వాదన వినిపించేలా చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో వివాదం పరిష్కారమవుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. కాగా, వంద ఎకరాల్లో గోశాల ఏర్పాటుతో జీవనోపాధి కోల్పోయే 40 కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. గోశాల ఏర్పాటు చేసే భూముల్లో చిన్న లేఅవుట్ ఏర్పాటు చేసి 200 చదరపు గజాల చొప్పున స్థలం కేటాయించేందుకు నిర్ణయించారు. దాంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించనున్నారు. కుటుంబానికి ఒకరికి గోశాలలో ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగం ఇవ్వాలని ఉన్నతస్థాయిలో నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలో హెచ్ఎండీఏ కమిషనర్, జిల్లా కలెక్టర్లు ఆయా కుటుంబాలతో చర్చించి ఈ అంశాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

సీఎం రేవంత్ దాచలేరిక కాంగ్రెస్‌లో గందరగోళం

ఎక్స్ వేదికగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా

హైదరాబాద్, 'ఖటాఖట్' నుంచి 'ఖాళీ ఖజానా' వరకూ.. అధికార కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న గందరగోళాన్ని సీఎం రేవంత్ ఇక దాచి పెట్టలేరని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బోగస్ వాగ్దానాలు, ఖజానా ఖాళీ చేయడం - కాంగ్రెస్ పాలన నమూనాకు తెలంగాణ అద్భుత ఉదాహరణ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మోస పూరిత వాగ్దానాల వలయంలో తెలంగాణ ప్రజలు చిక్కుకున్నారని 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు.

# బనకచర్లకు రేవంత్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుంది!

హైదరాబాద్, (సందేశం టైమ్స్, జూన్ 19): గోదావరి బేసిన్‌లో 1000 టీఎంసీలు, కృష్ణా బేసిన్‌లో 500 టీఎంసీలు తెలంగాణకు ఇచ్చి ఏపీకి ఎన్ని నీళ్లైనా తీసుకెళ్లాలని చెప్పడానికి నువ్వేమైనా రాజువా? నదీ జలాలు మీ అయ్య జాగీరా? మాకిన్ని నీళ్లు ఇచ్చి, మిగిలిన మొత్తం తరలించుకెళ్లమని చెప్పడానికి నువ్వెవరు? అని మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. గోదావరిలో 1950 టీఎంసీలు కావాలని కేసీఆర్ గతంలోనే అడిగారని, అలాంటిది నువ్వు 1000 టీఎంసీలు ఇస్తే చాలని, బనకచర్ల ప్రాజెక్టు కట్టుకోవాలని చెబుతావా? అని నిలదీశారు. రేవంత్‌కు బేసిన్స్, బేసిక్స్ కూడా తెలియవని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన మాట్లాడిన మాటలు చూస్తే బనకచర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుగా ఉందన్నారు. రేవంత్ తాను నల్లమల పులిబిడ్డనని చెప్పుకొంటాడని.. ఆయన పులిబిడ్డ కాదని, వెకిలి మాటల వెర్రిబిడ్డ అని హరీశ్ ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ నేతలు నిరంజన్‌రెడ్డి, మాలోతు కవిత, సబితా ఇంద్రారెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, తదితరులతో కలిసి హరీశ్ మీడియాతో మాట్లాడారు. ఓ వైపు మన రాష్ట్రానికి కృష్ణాలో 763 టీఎంసీల కోసం కొట్లాడుతుండగా.. మరోవైపు నువ్వు 500 టీఎంసీలు చాలంటే ఎవరికి నష్టమని నిలదీశారు. ట్రైబ్యునల్ దాన్నే ఆమోదిస్తే, తెలంగాణకు అన్యాయం జరగదా? అని ప్రశ్నించారు. నీ స్వార్థం కోసం రాష్ట్ర హక్కులను చంద్రబాబుకు రాసిస్తానంటే ప్రజలు ఊరుకోరని, ఉద్యమిస్తారని హెచ్చరించారు. సీడబ్ల్యూసీ లెక్కల ప్రకారం ఏటా గోదావరి నుంచి 3000 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని కేసీఆర్ అప్పటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అన్నారని, అప్పుడు బనకచర్ల ముచ్చటే రాలేదని చెప్పారు. అలాంటిది బనకచర్లకు నీళ్లు తీసుకువెళ్లాలని కేసీఆర్ చెప్పారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 200 టీఎంసీల నీటిని ఏపీ కొట్టుకుపోతుంటే ఆపలేవా?అని ప్రశ్నించారు.

అలా చెప్పడానికి నువ్వెవరు?

2020 అక్టోబరు 2న కేంద్ర మంత్రికి అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాశారని.. సముద్రంలో కలిసే 3000 టీఎంసీల గోదావరి నీళ్లలో 1950 టీఎంసీలు తెలంగాణకు కావాలని అందులో కోరారని హరీశ్ గుర్తుచేశారు. కృష్ణా బేసిన్లో 763 టీఎంసీలు తెలంగాణకు రావాలని ట్రైబ్యునల్ ముందు గతంలో అఫిడవిట్ దాఖలు చేసినట్లు చెప్పారు. అలాంటిది గోదావరి బేసిన్‌లో 1000 టీఎంసీలు, కృష్ణా బేసిన్‌లో 500 టీఎంసీలు ఇచ్చి ఏపీకి ఎన్ని నీళ్లైనా తీసుకెళ్లాలని చెప్పడానికి నువ్వెవరివి? అని రేవంత్‌ను నిలదీశారు. అఖిలపక్ష సమావేశాన్ని రాజకీయాలకు వేదికగా మార్చుకున్నారని విమర్శించారు. కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు చేశారని, అసలు విషయాన్ని దాచిపెట్టారని చెప్పారు. రేవంత్ చదివిన పేజీలోనే గోదావరి, కృష్ణా నదుల అనుసంధాన విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ముందుకు వెళ్లకూడదని ఉందని.. ఒకవేళ అలా చేస్తే తెలంగాణ అంగీకరించదని కేసీఆర్ స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు.

# వ్యవసాయ యాంత్రీకరణకు 104 కోట్లు!

హైదరాబాద్, (సందేశం టైమ్స్, జూన్ 19): వ్యవసాయ యాంత్రీకరణకు 2025- 26 సంవత్సరానికి బడ్జెట్‌లో రూ. 104 కోట్ల కేటాయింపులు చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యంత్రాలు, పరికరాలను సబ్సిడీ కింద పంపిణీ చేయడానికి ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న, సన్నకారు రైతులు, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. కేంద్రం 'నమో డ్రోన్ దీదీ' పథకం కింద సరఫరాచేసే 381 డ్రోన్లను మహిళా సంఘాలకు కేటాయించాలని తుమ్మల సూచించారు. పొద్దుతిరుగుడు, జొన్నల కొనుగోళ్లకు సంబంధించి 333 కోట్లు రైతులకు చెల్లించినట్లు తుమ్మల చెప్పారు.

వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు నిర్దేశించే దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్(సీఏపీపీ) సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) వినియోగంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు నెదర్లాండ్‌కు చెందిన 'ఏఆర్ఐక్యూటీ' కంపెనీ ప్రతినిధులతో తుమ్మల సమావేశమయ్యారు. రైతుల ఫిర్యాదులపై ఏఐ ఆధారంగా సూచనలు ఇస్తామని, పంటలను ఆశించే చీడపీడలను మొబైల్ కెమెరాతో స్కాన్‌చేసి గుర్తించే టెక్నాలజీని తీసుకొస్తామని తుమ్మలకు సంస్థ ప్రతినిధులు వివరించారు.

# ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ స్టాళ్లను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన

రామాపురం,(సందేశం టైమ్స్, జూన్ 19): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను తినడం ద్వారా సం పూర్ణ ఆరోగ్యం సాధ్యమని డాక్టర్లు వినోద్‌కుమార్, దివ్యశ్రీ తెలిపారు. రామాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలు, అకుకూరలు, దుంపజాతి, ఇతర పండ్ల రకాలతో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశా రు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫఎ పవన, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రవీంద్రగౌ డ్, రామాపురం మండలం మాస్టర్ ట్రైనర్ మధుకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్దతి ద్వారా పండించిన ఉత్పత్తుల ద్వారా మాత్రమే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి వెంకటమోహన, మోడల్ మేకర్ సదాశివరెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుధాకర్, హరి, ఆర్యో పర్యవేక్షకులు, ఏఎనయంలు ఇంకా ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

# 'మావాళ్లకే అవకాశమివ్వాలి'



ఎస్టేట్ అధికారిని నిలదీస్తున్న రైతులు, పొదుపు మహిళలు

రైతుబజార్ అధికారులు, సిబ్బందిపై రాజకీయ నాయకుల ఒత్తిడి

తామెక్కడికి పోవాలంటున్న రైతులు, పొదుపు మహిళలు

కర్నూలు (సందేశం టైమ్స్, జూన్ 19): సీఎం చంద్రబాబు మే నెల 17వ తేదీన సి.క్యాంపు రైతుబజా ర్‌ను పర్యటించారు. ఆయన వెళ్లిపోయారో లేదో.. ఇక్కడ తిష్ట వేసేందుకు కొంతమంది నాయకులు, వారి అనుచరులు ఆరోజు నుంచి ఈరోజు వరకు చేయని ప్రయత్నాలంటూ లేవు. ఒక దశలో సి.క్యాంపు రైతుబజారు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ వారి ఒత్తిడి తట్టుకోలేక ఇక్కడ తాను పని చేయలేనని, వేరే రైతుబజారుకు బదిలీ చేయించుకుని వెళ్లిపోతానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. సీ.క్యాంపు రైతుబజారులో తమ వారికే వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రతి రోజూ తెలుగు తమ్ముళ్లు అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రైతుబజారుకు ప్రధాన రహదారి కోసం సీఎం పర్యటన సందర్భంగా కొంత మంది రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకునే వారి అంగళ్లను తొలగించారు. ప్రస్తుతం అక్కడ వాహనాల రాకపోకలు మాత్రమే జరిగేలా కలెక్టర్, ఎస్పీలు చర్యలు తీసుకున్నారు. దాదాపు 60మంది దాకా ఆ ప్రధాన రహదారి వద్ద కూరగాయలు అమ్ముకుని జీవనం చేసేవారు. వీరికి తప్పనిసరిగా ఉపాధి కల్పిస్తామని సి.క్యాంపు రైతుబజారును విస్తరించిన తర్వాత అక్కడ వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో పాటు కొత్తగా ఏర్పాటు కానున్న కల్లూరులోని గోవర్ధనగిరి రైతుబజారులో స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇస్తామని వారికి రైతుబజార్ అధికారులు నచ్చజెబుతూ వస్తున్నారు. వీరంతా చోటా, మోటా నాయకులతో సీ.క్యాంపు రైతుబజారులోనే వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రతి రోజు నాయకులతో ఫోన్లు, సిఫారసు లెటర్లు తీసుకువస్తుండటంతో రైతుబజారు అధికారులు, సిబ్బందికి దిక్కుతోచడం లేదు. బయటివారు రైతుబజారులోకి ప్రవేశిస్తే కొన్నేళ్లుగా ఈ రైతుబజారునే నమ్ముకుని కూరగాయలు అమ్ముకుంటున్న తామెక్కడికి పోవాలని రైతులు, పొదుపులక్ష్మి గ్రూపుల మహిళలు బుధవారం సీ.క్యాంపు రైతుబజారు కార్యాలయంలో ఎస్టేట్ అధికారిని ప్రశ్నించారు. ఒక్కసారిగా రైతులంతా వచ్చి ప్రశ్నిస్తుండటంతో రైతుబజారు అధికారులకు, సిబ్బందికి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఏం సమాధానం చెప్పుకోవాలో అర్థంగాక తలపట్టుకుని కూర్చున్నారు. కలెక్టర్, జేసీ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, పొదుపుగ్రూపు మహిళలు మొర పెట్టుకుంటున్నారు.

# తోతాపూరి మామిడికి కిలోకు రూ.4 మద్దతు ధర

రైల్వేకోడూరు మామిడి యార్డులో రైతులకు పర్మిట్ అందజేస్తున్న ఉద్యానశాఖాధికారి భాస్కర్


కోడూరు ఉద్యాన శాఖాధికారి వెంకటభాస్కర్

రైల్వేకోడూరు,(సందేశం టైమ్స్, జూన్ 19): తాపూరి జ్యూస్ కాయలకు ప్రభుత్వం కిలోకు రూ.4 మద్దతు ధర ఇచ్చినట్లు రైల్వేకోడూరు ఉద్యాన శాఖ అధికారి ఎం.వెంకటభాస్కర్ తెలిపారు. ఆయన రైల్వేకోడూరు మామిడి యార్డును పరిశీలించి రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ రైతులు మండీల ద్వారాగాని, ఎఫ్‌పీఓల ద్వా రా గాని విక్రయించినప్పుడు తమ పేర్లను పర్మిట్‌లో న మోదు చేసుకుని గుజ్జు పరిశ్రమలకు తీసుకెళ్లాలన్నారు. గుజ్జు పరిశ్రమల వద్దకు కాయలను తీసుకుని వెళితే అక్కడ తమ సిబ్బంది ఉంటారని, వారికి 1-బీ, ఆధార్‌లింకు కలిగిన బ్యాంకు అకౌంట్ నెంబర్ ఉన్న పత్రాలను ఇచ్చి తమ పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి గుజ్జు పరిశ్రమలకు తరలించాల న్నారు. తోతాపూరి మామిడి రకానికి ఇచ్చే మద్దతు ధర రూ.4లు నేరుగా రైతు బ్యాంకు ఖాతాలోకి జమ అవుతుందన్నారు. గుజ్జు, జ్యూస్ పరిశ్రమల వారు కొన్న ధరను నేరుగా రైతుకు చెల్లిస్తారన్నా రు. వివరాల



కోసం రైతు సేవా కేంద్రం సిబ్బంది లేదా ఉ ద్యాన అధికారులను సంప్రందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, మండీల వ్యాపారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సుందుపల్లె: మామిడి కేజీపై రూ.4 అదనంగా ఇస్తుందని ఉద్యానశాఖ అధికారిణి వనితాభాయి తెలిపారు. మండలంలోని మామిడికాయల మండీలను ఆమె పరిశీలించారు. ప్రతి రైతూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

# అక్రమాలు కొండంత..చర్యలు గోరంత



- ఇదీ జగతిమెట్ట జగనన్న కాలనీలో పరిస్థితి
- 150 వరకు అక్రమ పట్టాల గుర్తింపు
- రద్దు చేసింది 40 మాత్రమే
- మరో 18 పునాదులు తొలగింపు
- కీలక రికార్డులు మాయం
- కారణమైన అధికారులపై కానరాని చర్యలు


(సందేశం టైమ్స్, జూన్ 19): టెక్కలి మండలం జగతిమెట్ట జగనన్న ఇళ్ల కాలనీ అక్రమాల పుట్టగా తయారైంది. ఈ కాలనీలో వేసిన లేఅవుట్లు, పట్టాల కేటాయింపు ఇలా అన్నింట్లో కూడా భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇష్టారాజ్యంగా పొజిషన్ సర్టిఫికెట్లను జారీ చేశారు. రూ.లక్షలకు వాటిని అమ్ముకున్నారు. కీలకమైన రికార్డులు మాయమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీకి కొందరు నాయకులు, కొందరు రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇవన్నీ బయటపడ్డాయి. కానీ, ఏడాది అవుతున్నా చర్యలు మాత్రం నామమాత్రమే. దీంతో అక్రమాలు కొండంత, చర్యలు మాత్రం గోరంత అన్న చందంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ కోసం టెక్కలి దరి జగతిమెట్ట సమీపంలో సర్వేనెం.288, 289లో సుమారు 12 ఎకరాల డీ.పట్టాను అధికారులు సేకరించారు. శ్యామసుందరాపురానికి చెందిన 40మంది రైతులకు చెందిన ఈ భూమిని ల్యాండ్ ఎక్విజేషన్ ద్వారా సేకరించారు. వీరికి నగదు చెల్లింపులు కూడా జరిగాయి. అలాగే, వీరికి ఒక్కో ఇంటి పట్టాను అందించాల్సి ఉంది. కానీ, అధికారులు మాత్రం 40మందికి బదులు 70 మంది రైతుల పేర్లు సృష్టించి వారికి పట్టాలు అందించారు. ఇళ్ల పట్టాల కేటాయింపుల్లో కొందరు రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శించి దొరికినకాడికి దోచుకున్నారు. అప్పటి అధికార పార్టీకి చెందిన కొందరి ప్రజాప్రతినిధుల సిఫారసులతో ఇష్టారాజ్యంగా ఇళ్ల పట్టాలు జారీచేయడం, పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయడం చేశారు. అప్పట్లో కొందరు వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు దళారీల అవతారం ఎత్తారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్ల పట్టాలను భారీ ధరలకు అమ్మకాలు చేశారు. ఈ కాలనీలో 389 లేఅవుట్లకు అనుతులు ఉంటే 420 వెలిశాయి. 150 వరకు భోగస్ పట్టాలు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణమే జగతిమెట్ట జగనన్న కాలనీలోని అక్రమాలను వెలికితీయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి ఆ బాధ్యతలను మంత్రి అప్పగించారు. దీంతో ఆర్డీవో విచారణ చేపట్టారు. తీగలాగితే దొంక కదిలినట్లయింది. భూములు ఇచ్చిన రైతులు 40మంది అయితే 70మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు గుర్తించారు. అలాగే 389 లేఅవుట్లకు బదులు 420 లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించారు. 150 వరకు భోగస్ పట్టాలు ఉన్నట్లు తేల్చారు. ఈ లేఅవుట్లలో 70వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇక్కడ పొజిషన్ సర్టిఫికెట్లను రూ.లక్షలకు కొనుక్కొని ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిన వారు వందల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తుంది. కానీ, అధికారులు మాత్రం కేవలం 18 ఇళ్ల పునాదులను తొలగించి మమ అనిపించారు. అలాగే, 40 బోగసు పట్టాలు రద్దు చేసి చేతులు దులుపుకొన్నారు.

# గంజాయి ముఠా అరెస్టు

5 కిలోల సరుకు స్వాధీనం

ఒంగోలు (సందేశం టైమ్స్, జూన్ 19): గంజాయిని విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి ఒంగోలు పరిసరప్రాంతాలలో విక్రయిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 5 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నా మని చెప్పారు. ఈక్రమంలో సాయంత్రం స్థానిక సీతారామపురం కొండమీద గల రామాలయం వద్ద చినగజాంకు చెందిన కుక్కల గోవర్ధన్‌రెడ్డి, ఒడిశాకు చెందిన రాజేష్‌నాయక్, మహేశ్వర ముడి, ఒంగోలు బడ్డమిట్టకు చెందిన షేక్ ముజీర్‌ని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

# యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యం: ఎమ్మెల్యే శంకర్



శ్రీకాకుళం (సందేశం టైమ్స్, జూన్ 19): యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం లోని 80అడుగుల రోడ్డులో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో యోగ నిర్వహించారు. ఈసందర్భంగా గత ఏడాది పాలనలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే శంకర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి పి.జగదీష్, ఆర్ట్ ఆఫ లివింగ్ శిక్షకులు అమ్మన్నాయుదు, వి.సుధారాణి, కొరాఠి రేణుక, నంబాళ్ల కల్పన, రాంబాబు, దేశళ్ల సురేంద్ర, గోవిందరావు, ఆదినారాయణ, శేఖర్, తంగి స్వాతి, కొంక్యాన మురళి, దుంపల చిన్నబాబు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్




మార్కాపురం,(సందేశం టైమ్స్, జూన్ 19): ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ మార్కాపురం డివిజన్ పరిధిలో ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు 44, ప్రభుత్వ వైద్యశాలల్లో ఐదు ఉ న్నాయన్నారు. డివిజన్ పరిధిలో ఆడ పిల్లల నిష్పత్తి తక్కువగా ఉందన్నారు. వెయ్యిమంది మగ పిల్లలకుగాను 981 మంది ఆడపిల్లలు ఉన్నారన్నారు. ఈ నిష్పత్తి అంతరాన్ని తగ్గించేందుకు వైద్యా?ధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.పద్మావతి, టౌన్ ఎస్సై డాక్టర్ ఎమ్.రాజమోహన్‌రావు,్యాక్టర్ శివారెడ్డి, మదర్స్ ఇండియా సంస్థ సెక్రటరీ జీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

# పోలీస్ టెక్నికల్ టీంకు ప్రోత్సాహకాలు

అనంతపురం(సందేశం టైమ్స్, జూన్ 19): 25 మంది పోలీస్ ఐటి కోర్ టీం సిబ్బందికి ఎస్పీ పి.జగదీష్ నాడు ప్రోత్సాహక బహుమతి కింద స్మార్ట్ వాచ్‌లు అందజేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం జిల్లా పోలీసుశాఖ సుమారు 12 ఐటి అప్లికేషన్లు అమలు చేస్తోంది. వీటిలో సిసిటిఎన్ఎస్, మీ సేవ, స్మార్ట్ పోలీస్, ఐరాడ్, ఈ చలానా తదితర అప్లికేషన్లను వినియోగించడంలో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఇటీవల కానిస్టేబుళ్ల ఎంపికకు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలన, బయోమెట్రిక్ తీసుకోవడం తదితర వాటిని నిర్వహించిన



# వెంటనే ఫ్యాకల్టీని భర్తీ చేయాలి

**☛ వైద్యుల హాజరు కూడా 70 శాతమే. ☛ మీ యాక్షన్ ప్లాన్ ఏమిటో చెప్పండి**
**☛ సమీక్షించిన తర్వాత తదుపరి నిర్ణయం**



అమరావతి,(సందేశం టైమ్స్, జూన్ 19): కొత్త మెడికల్ కాలేజీల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలని, ఫ్యాకల్టీని వెంటనే భర్తీ చేయాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) రాష్ట్ర అధికారులను ఆదేశించింది. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీల్లో లోపాలను ఎన్ఎంసీ తీవ్రంగా పరిగణించింది. రెండేళ్లు గడువిచ్చినా ప్రభుత్వం కనీసం లోపాలు సరిదిద్దకపోవడంతో ఏపీ అధికారులకు ఘాటు లేఖ రాసింది. వెంటనే ఢిల్లీకి వచ్చి సమాధానం చెప్పాలని కోరింది. దీంతో రాష్ట్ర అధికారులు ఆగమేఘాల మీద ఢిల్లీకి పరుగులు తీశారు. ఎన్ఎంసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏపీ డీఎంఈ డాక్టర్ నరసింహం, ఆన్‌లైన్‌లో సెక్రటరీ డాక్టర్ మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎంసీ అధికారులు 5 కాలేజీల్లోని లోపాలను రాష్ట్ర అధికారుల ముందుంచారు. 25 శాతానికిపైగా సిబ్బంది కొరత ఉందని, సిబ్బంది హాజరు కూడా 70–75 శాతం కూడా లేదని తెలిపింది. చాలామంది సెలవుల్లో ఉంటున్నారని, ఇలా అయితే అడ్మిషన్లకు అనుమతులివ్వడం కష్టమేనని హెచ్చరించింది. కాలేజీల్లోని లోపాలపై మీ యాక్షన్ ప్లాన్ ఏమిటని అధికారులను ప్రశ్నించింది. యాక్షన్ ప్లాన్ ఇస్తే దానిపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

# మళ్లీ పెరిగిన ఎండ

**జంగమహేశ్వరపురంలో 40.1 డిగ్రీలు**
**నేడు అక్కడక్కడ ఈదురుగాలులతో వర్షాలు**



విశాఖపట్నం,(సందేశం టైమ్స్, జూన్ 19): రాష్ట్రంపైకి నైరుతి వైపు నుంచి గాలులు వీచినా.. పలుచోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత పెరిగాయి. కోస్తాతోపాటు దానికి ఆనుకుని ఉన్న రాయలసీమ జిల్లాల్లో ఎండ ప్రభావం ఎక్కువగా ఉంది. జంగమహేశ్వరపురంలో 40.1, తిరుపతిలో 39.4, కావలిలో 38.8, నెల్లూరులో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అక్కడక్కడ వర్షాలు కురిశాయి. కాగా, పశ్చిమబెంగాల్ పరిసరాల్లో ఉన్న అల్పపీడనం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది వాయవ్యంగా పయనించనుంది. ఇంకా గుజరాత్ పరిసరాల్లో అల్పపీడనం స్థిరంగా ఉంది. వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు మధ్య, వాయువ్య, తూర్పుభారతంలో అనేక ప్రాంతాలకు విస్తరించాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, యూపీ, బిహార్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్ వరకూ విస్తరించనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# జగన్ రీసర్వే.. మాయాజాలం!

- ముదినేపల్లి మండలం పెయ్యేరు ప్రాథమిక పాఠశాల వద్దకు వచ్చిన తల్లికి వందనం అందుకోని విద్యార్థుల కుటుంబం
- తల్లికి వందనానికి శాపం
- సెంటు భూమి లేకున్నా భూస్వాములను చేసేశారు
- వ్యవసాయ కూలి పేరిట 118 ఎకరాలు.. వడ్రంగికి 46 ఎకరాలు
- గత ప్రభుత్వ హయాంలో విచిత్రాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



(సందేశం టైమ్స్, జూన్ 19):అధికారుల బాధ్యతారాహిత్యం.. గత వైసీపీ పాలకుల అలసత్వం వెరసి.. నిరుపేదల కుటుంబాలను ప్రభుత్వ పథకాలకు దూరం చేసింది. జగన్ సర్కార్ హయాంలో చేపట్టిన భూముల రీ సర్వే పేదల పాలిట శాపంగా మారింది. నిరుపేదలను భూస్వాములుగా చూపడంతో ప్రస్తుతం వారి పిల్లలు తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు. ఇప్పుడు వీరంతా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మండవల్లి/ముదినేపల్లి, గత వైసీపీ ప్రభుత్వం రైతుల భూముల రీసర్వేకు నిర్ణయించి హైదరాబాద్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా సంస్థకు కాంట్రాక్టు ఇచ్చింది. ఆ సంస్థ సిబ్బంది డ్రోన్ల ద్వారా భూమి సర్వే చేసి రికార్డుల్లో రైతుల భూవివరాలు నమోదు చేశారు. డ్రోన్ సర్వే అనంతరం సర్వేచేసిన భూమి మీద వాస్తవ పరిస్థితులు, ఎవరి ఆధీనంలో ఉంది ? ఎవరు భూ యజమానులు, ఎవరు హక్కుదారులు ? అని నిర్ధారించు కోవాల్సి ఉంది. గ్రామసభ ద్వారా ఆ భూములు వివరాలు రైతులకు యజమానులకు తెలిపి ఫారం 54 ద్వారా యజమానుల నుంచి ఒప్పంద పత్రం తీసుకోవాలి. అధికారులు అవేవి చేయకుండా నిరుపేదల జీవితాలతో చెలగాటమాడారు.మండవల్లికి చెందిన షేక్ బాజీ తన తాత, తల్లిదండ్రుల కాలం నుంచి పంట కాలువ పక్కన ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో చిన్న తాటాకిల్లు వేసుకొని కూలి పనులు, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ పనికి వెళ్లాందే ఇంట్లో పొయ్యి వెలగని పరిస్థితి కుటుంబానిది. కానీ సర్వే నంబర్ 948లో 118 ఎకరాలు ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపడంతో అతను అవాక్కయ్యాడు. తన కుమార్తె షేక్ నాజీయా చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నాడు.ంండవల్లికి చెందిన వల్లూరి ప్రసాద్ వడ్రంగి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనితో పాటు తమ్ముడి కుటుంబం చిన్నపాటి రేకుల షెడ్డులో ఉంటున్నారు. అతని కుమారుడు నాగరంగ వెంకట సత్యప్రసాద్‌కు 'తల్లికి వందనం' సొమ్ము జమ కాకపోవడంతో కారణం తెలుసుకునేందుకు సచివాలయానికి వెళ్లగా 'నీ పేరిట 46 ఎకరాలు ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపుతోంది' అని సిబ్బంది తెలపడంతో ఖంగుతిన్నాడు. జన్ను శివనాగ రాజు వ్యవ సాయ పనులు చేసుకుంటూ పంటకాల్వ పక్కన ఇరిగేషన్ స్థలంలో షెడ్డు వేసుకుని జీవిస్తున్నాడు. అతనికి 47 ఎకరాలు ఉన్న ట్టు చూపడంతో కుమార్తె జస్వంత్ సాహితి తల్లికి వందనం పథకానికి అనర్హురాలిగా తేలింది. మండవల్లిలోని కైకలూరు సందులో నివాసం ఉన్న శాయన కృష్ణ సురేష్‌కు 20 సెంట్లు భూమి ఉండ గా 17 ఎకరాలు ఉన్నట్టు రికార్డులో నమోదు అయ్యింది. దీంతో అతని కుమారుడు నిఖిలేశ్వరకార్తీక్‌ను అనర్హుడిగా ప్రకటించారు.

# వాటర్‌షెడ్ పనుల పరిశీలన

**వివరాలను పరిశీలిస్తున్న నాబార్డు అధికారులు**



గడివేముల, (సందేశం టైమ్స్, జూన్ 19): మండలంలోని గని గ్రామంలో నాబార్డ్, జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ఆర్థిక సహకారంతో చేసిన వాటర్‌షెడ్ పనులను నాబార్డ్ డీడీఎం కార్తీక్ పరిశీలించారు. అనంతరం కమిటీ సభ్యులు, రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వాటర్‌షెడ్ ద్వార భూగర్భజలాలు పెరుగుతాయని అన్నారు. భూ సంరక్షణ పనులు చేపట్టడం వల్ల భూమి కోతను నివారించవచ్చని అన్నారు. నవ యువత అసోసియేషన్ డైరెక్టర్ నరసింహులు, ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మీనారాయణ, ఇంజనీర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టు అభివృద్ధికి రూ.8.033 కోట్లు : మంత్రి బీసీ



బనగాన పల్లె, (సందేశం టైమ్స్, జూన్ 19): కర్నూలు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం రూ. 8.033 కోట్లకు అనుమతి లభించిందని రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక వనరుల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు ఎయిర్‌పోర్టులో 2 అభివృద్ధి పనులకు 2025–26 సంవత్సరానికి విమానాశ్రయం కార్యకలాపాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. రన్‌వేస్ అండ్ సేఫ్టీని సరిదిద్దడానికి ఇతర నిర్వహణ పనులకు రూ.3.6 కోట్లు, కర్నూలు ఎయిర్‌పోర్టులో టాక్సీవేటు ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ అందించడానికి రూ.4.433 కోట్లకు అనుమతి లభించాయన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

# మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



సుండుపల్లె, (సందేశం టైమ్స్, జూన్ 19): మూడు నెలలకు ఒక్కసారి ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరుగుతోంది. వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి స్థానిక ఎన్నికలు పూర్తి అయిన తర్వాత జరిగిన సర్వసభ్య సమావేశం నుంచి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సర్వసభ్య సమావేశంలో సమస్యలు పరిష్కరించిన పాపాన పోలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు ఉదయం 10 గంటలకు సభకు హాజరు కావాల్సి ఉండగా మధ్యాహ్నం 12 గంటలకు హాజరయ్యారు. గత సమావేశంలో వివరించిన ఏ సమస్యకు పరిష్కారం చూపినట్లు ప్రస్తావించలేదు. పైగా కీలక పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారులు ఎవరూ సమావేశానికి హాజరు కాలేదు. మండల వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు ఉన్నాయి. ఆ శాఖకు సంబంధించిన అధికారులు హాజరుకాకపోవడం ఏమిటని ఎంపీపీ రాజమ్మ ప్రశ్నించారు. అంతేగాకుండా ఎంపీటీసీలు కూడా గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు ఎన్నికలు లేకుం డా ఏకగ్రీవంగా చేసుకున్న వారు కావడంతో ప్రజా సమస్యలు ఉంటే మాకేంటి అనే ధోరణిలో వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. చిన్నగొల్లపల్లి సర్పంచ మి నహా సర్పంచులు ఎవరూ సమవేశానికి హాజరు కా లేదు. గత ప్రభుత్వంలో సమవేశాలు నిర్వహించారు కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న నిధులు ఏం చేశారో లెక్కలు చెప్పలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి.

# రైతులే ధర నిర్ణయించేలా ఎదగాలి

**రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి**
**964 మంది రైతులకు రూ.1.99 కోట్ల రాయితీ**
**%వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేసిన కలెక్టర్**

నంద్యాల నూనెపల్లె, (సందేశం టైమ్స్, జూన్ 19): పండించిన పంటకు ధర నిర్ణయించే స్థాయికి రైతులు ఎదగాలని నంద్యాల కలెక్టర్ రాజకుమారి ఆకాంక్షించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద జిల్లాలో 964మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.1.99 కోట్ల వ్యవసాయ పరికరాల రాయితీని ప్రభుత్వం విడుదల చేసినట్లు ఆమె పేర్కొన్నారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో వ్యవసాయ యాంత్రీకరణ సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెషనైజేషన్ పథకం కింద వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లాలోని సహాయ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు. రైతులకు విడుదల చేసిన రూ.1.99కోట్ల రాయితీ నిధుల చెక్కును కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు.

# బీటెక్ ఫలితాలు విడుదల

(సందేశం టైమ్స్, జూన్ 19): అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్, మే నెలలలో నిర్వహించిన బీటెక్ ఫలితాలు విడుదల అయ్యాయి. బీటెక్ నాలుగవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్20, 19, 15) సప్లిమెంటరీ, బీఫార్మసీ ఒకటవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్ 23, 19, 15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య వి.నాగ ప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎపి.శివ కుమార్, అడిషినల్ కంట్రోలర్స్ ఆచార్య జి.శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎం.అంకారావు వీటిని విడుదల చేశారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006